ప్రజాశక్తి

ఆదివారం 16 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కు సంకల్పయాత్రకు జన నీరాజనం



పూలవర్షం నడుమ సాగుతున్న పాదయాత్ర

- 27 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర
- ఎక్కడికక్కడ ఘన స్వాగతం
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తిప్పికొడతామన్న నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు శనివారం తలపెట్టిన ఉక్కు సంకల్ప మహా పాదయాత్రకు ఎక్కడికక్కడ జనం ఘన స్వాగతం పలికారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంలో తామూ భాగస్వాములవుతామని ప్రతినబూనారు. పాదయాత్ర బృందంతో కలిసి నడిచారు. ఓ వైపు ఎండ దారెత్తిస్తున్నా వెరవక ఉక్కు సంకల్పంతో ముందుకు సాగారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉదయం ఆరు గంటలకే కూర్మన్నపాలెం, పెదగంట్యాడ జంక్షన్ల నుంచి పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. ఇవి పాత గాజువాకలో కలిశాయి. అక్కడి నుంచి పంతులుగారి మేడ, బిహెచ్‌పివి, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం, షీలానగర్, విమానాశ్రయం, ఎన్ఎడి కొత్త రోడ్డు, బుచ్చిరాజుపాలెం, బాజీ జంక్షన్, గోపాలపట్నం, ప్రహ్లాదపురం, గోశాల మీదుగా సింహాచలం వరకు ఈ మహా పాదయాత్ర సాగింది. దారి పొడవునా పాదయాత్ర చేస్తున్న వారిపై ప్రజలు పూలు జల్లి స్వాగతం పలికారు. తాగునీరు, మజ్జిగ, పండ్లు అందజేశారు. పాదయాత్ర సమయంలో కొంతమంది మిగతా 2లో..



సింహాద్రి అప్పన్న విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ నేతలు



ఆరిలోవలో ప్రచార భేరి నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ కార్యకర్తలు

జోరుగా ప్రచార భేరి

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న నేతలు వార్త 8లో..

అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన మేడే ఉత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా ఈ నెల 30న డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మే డే సాంస్కృతిక ఉత్సవాలను విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఎఎస్‌వికె బాధ్యులు జిఎస్.రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం బాధ్యులు దండు నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులలో కళా ప్రావీణ్యంగల వారందరినీ ఒక దగ్గరకు చేర్చి ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలు, శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలు, మిగతా 2లో..

పులుపెక్కిన నిమ్మకాయలు

వార్త 3లో..

నేడు నాటక రంగ వేడుకలు

వార్త 2లో..

కెజిహెచ్ ఎస్‌టి సెల్ ప్రక్షాళనపై హర్షం

వార్త 2లో..



ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన స్వర్ణభారతి స్టేడియం రోడ్డు

తీవ్ర వడగాల్పులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖతో పాటు అనకాపల్లి జిల్లాలోని 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు ఇప్పటికే వీస్తున్నాయని, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రెండు రోజుల్లో అల్లూరి జిల్లా కూనవరం, అనకాపల్లి జిల్లా నాతవరం, తదితర ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

జివిఎంసి కమిషనర్‌గా

సాయికాంత్ వర్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా సిఎం.సాయికాంత్ వర్మ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2015 బ్యాచ్‌కి చెందిన ఈ ఐఎఎస్ అధికారి వైఎస్ఆర్ కడప జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకూ జివిఎంసి కమిషనర్‌గా పనిచేసిన పి.రాజాబాబు ఉద్యోగోన్నతిపై కృష్ణా జిల్లా కలెక్టర్‌గా వెళ్లారు.

బాధ్యతలు చేపట్టిన అనంతరం సాయికాంత్ వర్మ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అతిపెద్ద కార్పొరేషన్‌గా ఉన్న జివిఎంసికి కమిషనర్‌గా రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పనిచేసిన కమిషనర్లు చేపట్టిన మంచి కార్యక్రమాలను తానూ కొనసాగిస్తానన్నారు. అధికారులు, మీడియా ప్రతినిధులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన మేయర్ హరి వెంకట కుమారిని, విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, తదితరులను మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

మొదటి పేజీ తరువాయి..



పాదయాత్రలో వడదెబ్బకు గురై సింహాచలం ఆసుపత్రిలో చేరిన నాయకుడు

ఉక్కు సంకల్పయాత్రకు జన నీరాజనం

ఎండకు కళ్లు తిరిగి పడిపోగా వారికి జనమే సపర్యలు చేశారు. విశ్రాంత ఉద్యోగులు సైతం ఈ పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

అన్ని పార్టీల నుంచీ మద్దతు

మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు, జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, దల్లి గోవింద సహా అన్ని రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాదయాత్రకు మద్దతు తెలిపారు. పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో - కన్వీనర్లు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, నాయకులు రామస్వామి, వైటి.దాస్, మస్తానప్ప, వరసాల శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, డివి.రమణారెడ్డి తదితరులు పాదయాత్రకు నాయకత్వం వహించారు.

గాజువాక : పాదయాత్ర గాజువాక జంక్షన్‌కు చేరుకున్న సమయంలో సేవ్ వైజాగ్ స్టీల్ నినాదం మార్మోగింది. పెదగంట్యాడ వద్ద ప్రారంభమైన పాదయాత్రలో సిఐటియు నాయకులు నమ్మి రమణ, బైరెడ్డి గురప్ప, కోవిరి అప్పలరాజు, కణితి అప్పలరాజు, ఎఐటియుసి నాయకులు మసేను, ఐఎన్‌టియుసి నాయకులు ప్రభాకర్, టిడిపి నాయకులు పులి రమణారెడ్డి, జనసేన నాయకులు కోన తాతారావు పాల్గొన్నారు.

గోపాలపట్నం : పాదయాత్రకు ఎన్ఎడి ఫ్లైఓవర్ వద్ద జివిఎంసి డిప్యూటీ మేయర్ మేయర్ జియ్యాని శ్రీధర్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ (ఆల్ఫా కృష్ణ), వైసిపి 90వ వార్డు అధ్యక్షులు చుక్కా ప్రసాద్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. గోపాలపట్నంలో సిఐటియు నేతల నుంచి పాదయాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.వెంకటరెడ్డి మాట్లాడారు. నాయకులు బలివాడ వెంకటరావు, పి.సత్యనారాయణ, వి.ప్రభావతి, పి.అనసూయ, జి.మురళీకృష్ణ, జి.సుబ్బారావు, పైడమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : స్థానికంగా ఉక్కు పాదయాత్రకు మంచి స్పందన లభించింది. వైసిపి, టిడిపి, జనసేన, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, బిఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉక్కు ఉద్యమానికి మద్దతు తెలిపిన వారిలో టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, 98వ వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం, టిడిపి వార్డు అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు, వైసిపి నాయకులు ఎర్రవరం బాబు, లంక సత్తిబాబు, నర్సల అప్పారావు, జనసేన నాయకులు పంచకర్ల సందీప్, కోన తాతారావు ఉన్నారు. పాదయాత్ర ముగింపులో సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ మాట్లాడారు. కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన మేడే ఉత్సవాలు

తప్పెటగుళ్లు, ఏకపాత్రాభినయాలు, ప్లూటు తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రీ, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా ఈ ఉత్సవాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రదర్శించే ఏ కళారూపమైనా విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ సంస్థల పరిరక్షణ, దేశభక్తి, దేశ సమైక్యత, సమగ్రత, లౌకికతత్వం, సామాజిక న్యాయంలపై ఉండాలన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 25లోగా తమ ఎంట్రీలను 9490750661,. 9490098794 వాట్సాప్ నెంబర్లకు పంపించాలని కోరారు.

పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ వంశీకృష్ణ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 21వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ జివిఎంసి అడిషనల్ కమిషనర్ సన్యాసిరావుతో కలిసి శనివారం పర్యటించారు. అవుట్ గేట్ డౌన్, కిర్లంపూడి లే అవుట్, బీచ్ రోడ్ పరిసర ప్రాంతాలలోగల ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. శనివారం 41వ వార్డు బాబు కాలనీలో రూ.కోటితో తలపెట్టిన భూగర్భ పంప్ హౌస్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

ఉక్కుపై కుట్రలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై గందరగోళం సృష్టించి బలహీనపరిచే కుట్రలను కేంద్రంలోని బిజెపి సర్కారు తీవ్రం చేస్తోంది. స్టీల్‌ప్లాంట్ కోసం చేసిన పోరాటం, త్యాగాలను ఏ మాత్రమూ పరిగణలోకి తీసుకోని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండడంతో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక సంఘాలు మరింత బలంగా తమ ఉద్యమాన్ని ప్రజల సహకారంతో ముందుకు తీసుకెళ్లాలని తాజాగా కదులుతున్నాయి. తాజాగా కేంద్ర సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే విశాఖలో రోజ్‌గార్ మేళాలో ఈ నెల 13న పాల్గొని మీడియా వద్ద ఆర్ఐఎన్ఎల్ ప్రైవేటీకరణపై తమ ప్రభుత్వం ముందుకెళ్లడం లేదని ప్రకటించారు. కార్మిక సంఘాలు, ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్న సమయంలో సాయంత్రానికల్లా వైజాగ్ నోవటెల్‌లో మాట మార్చి ప్రైవేటీకరణ విషయంపై తాను ఎలాంటి నిర్ణయమూ చేయలేనంటూ చేతులెత్తేశారు. దీంతో కార్మికవర్గంలో మళ్లీ కలవరం మొదలైంది.

సొంత గనుల్లేకపోయినా దేశంలోనే మేజర్ స్టీల్‌మేకర్ 'విశాఖ ఉక్కు'

దేశంలోనే సొంత గనుల్లేకపోయినా ఉక్కును ఉత్పత్తి చేసే భారీ స్టీల్‌పరిశ్రమగా వైజాగ్ స్టీల్ వెలుగొందుతుండడంతో కేంద్రంలోని కాషాయ పాలకులు కక్షాపూరితంగా వ్యవహరిస్తున్నారు. రూ.లక్షల కోట్ల విలువైన ఆస్తులున్నప్పటికీ కేవలం రూ.1000 కోట్లు వర్కింగ్ కేపిటల్‌ను ఇవ్వలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయంటే స్టీల్‌ప్లాంట్ భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలు ఊపందుకుంటున్నాయన్నది స్పష్టమవుతోంది. 2021 జనవరిలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం ప్రైవేటీకరించడం, లేదా అమ్మేయాలని మోడీ సర్కారు నిర్ణయించిన



నుంచీ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం, ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాడుతున్న విషయం తెలిసిందే. అటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అక్కడి ప్రజానీకం, మేధావులు సైతం విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ జరగాలని, మోడీ ప్రైవేటీకరణ విధానం నాశనం కావాలని కోరుకుంటున్న సంగతి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. 1962లో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో పోరాడి యావత్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు దీన్ని సమైక్యంగా సాధించారు. ఈ పోరాటంలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. కేవలం కేంద్ర ప్రభుత్వం అప్పట్లో రూ.4890 కోట్లు మాత్రమే పెట్టుబడిగా ఇవ్వగా మరో రూ.4 వేల కోట్లును బ్యాంకు రుణం ద్వారా స్టీల్‌ప్లాంట్ సమకూర్చుకుని తిరిగి రూ.16,300 కోట్లను పెట్టుబడిగా పెట్టి కెపాసిటీని పెంచుకునేందుకు ఆర్ఐఎన్ఎల్ సొంతంగా కృషిచేయడం విశేషం. ఈ నిధుల ద్వారా 3.2 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు రెండు దఫాలుగా విస్తరణ చేసుకుంది. ఇంకా సొంత గనులు కల్పించి ఉండి ఉంటే, వర్కింగ్ కేపిటల్, రా మెటీరియల్‌ను కేంద్ర ప్రభుత్వం అందించి ఉండి ఉంటే 12 మిలియన్ టన్నులకు వెళ్లేందుకు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగ, కార్మిక సంఘాలు, యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

భవిష్యత్తును దెబ్బతీసే చర్యలు

ఉత్తరాంధ్ర ప్రజానీకానికి ఉపాధి కల్పించే కల్పతరువుగా ఉండే స్టీల్‌ప్లాంట్‌పై కాషాయమూకలు దొంగదెబ్బ కొట్టాలని చూడడం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి సర్కారు కనీసం తెలంగాణ సర్కారు ఇచ్చిన నైతిక మద్దతును కూడా ఇవ్వకపోవడం కార్మికవర్గాన్ని, ఈ ప్రాంత ప్రజలను ఒకింత అనిశ్చితికి గురిచేస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

విశాఖపై వాతావరణ ప్రభావం అధికం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శనివారం ఆమె హోటల్ ది పార్కులో వాతావరణం మార్పుపై జరిగిన వర్క్ షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతంతో పాటు పారిశ్రామిక నగరం అవడం వల్ల నిరంతరం వాతావరణంలో మార్పులు ఉంటాయని తెలిపారు. ఈ నగరానికి తుపాను ప్రభావం కూడా అధికమేనన్నారు. గతంలో హుదూద్, గులాబ్ లాంటి తుపానుల ప్రభావాన్ని ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణకుగాను ఇంటకు గుంతల ఏర్పాటు, చెట్లు పెంపకం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. సోలార్ ఎనర్జీ, ఎల్ఇడి స్ట్రీట్ లైట్, విద్యుత్ వాహనాలు, నీటి ప్రాజెక్టుల వినియోగం ద్వారా గాలిలో కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో జివిఎంసి బయాలజిస్ట్ కె.చక్రవర్తి, స్మార్ట్ సిటీ కార్యనిర్వాహణ ఇంజినీర్ వి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు వైకల్యం అడ్డుకాదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనుకున్న లక్ష్యం సాధించడానికి లింగ బేధం, అంగవైకల్యం అడ్డు కావని ముగ్గురు హిజ్రాలు వైద్యులై నిరూపించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. నగరంలోని శివాజీ పార్క్ సమీపంలో ఉన్న సవేరా ఫంక్షన్ హాల్‌లో శనివారం 'హ్యాపీ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌జెండర్ డే'ను పురస్కరించుకొని సంరక్షణ సంక్షేమ సంఘం నేతృత్వంలో హిజ్రా డాక్టర్లు ప్రాచీ రాథోడ్, రూత్ జాన్‌పాల్, డాక్టర్ మిత్రాలను మేయర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నింటి వరలక్ష్మి, ప్రేమ ఆసుపత్రి చైర్‌పర్సన్ డాక్టర్ శశిప్రభ పాల్గొన్నారు.

నేడు నాటక రంగ వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న తెలుగు నాటక రంగ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలోని టిఎస్ఆర్ కాంప్లెక్సు వద్ద ఉన్న రంగసాయి నాటక గ్రంథాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆధునిక తెలుగు నాటక రంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి నేపథ్యాన్ని పురస్కరించుకుని తెలుగు నాటకరంగ దినోత్సవంగా పరిగణిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా రంగస్థల పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. నగరంలో నాటక రంగానికి చెందిన ఎం.శివజ్యోతి, వర్రె నాంచారయ్య, సివిఆర్ మూర్తి, ఇప్పిలి ఆదినారాయణలకు అవార్డులందజేస్తున్నట్లు వెల్లడించారు. వేడుకల్లో భాగంగా ఎంవి.సుబ్రహ్మణ్యం బృందంచే లఘు నాటిక, ఏకపాత్రాభినయ ప్రదర్శనలు ఉంటాయని, కళాకారులు, నగర ప్రజలు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కెజిహెచ్ ఎస్‌టి సెల్ ప్రక్షాళనపై హర్షం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్ ఎస్‌టి సెల్‌ను ప్రక్షాళన చేయడంలో భాగంగా మొత్తం సిబ్బందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న ముంచింగిపుట్టుకి చెందిన శివష్ఠ మృతదేహాన్ని కెజిహెచ్ నుంచి తండ్రి బైకుపై వారి స్వగ్రామానికి చేరవేసిన తీరును తమ కమిషన్ సుమోటోగా తీసుకుందని తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు బదిలీ చేయాల్సిందేనని సంబంధిత శాఖలకు అప్పట్లోనే నోటీసులు జారీ చేసిందని అన్నారు. కమిషన్ ఆదేశాలను పరిశీలనలోకి తీసుకున్న పాడేరు ఐటిడిఏ, అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మొత్తం సిబ్బందిని బదిలీ చేసి కొత్తగా 11 మందిని ఎస్‌టి సెల్‌లో నియమించడం విజయంగా భావిస్తున్నామని తెలిపారు.

నిరుపేదలకు సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమాజంలో నిరుపేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్ అన్నారు. శనివారం పాత నగరంలోని వివేకానంద అనాథ వృద్ధుల ఆశ్రమంలో నిరుపేదలకు అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జహీర్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు దంపతులు వివేకానంద సంస్థకు రూ. లక్షను విరాళంగా అందజేశారు.

నేవీ ఆధ్వర్యాన బీచ్ క్లీన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ నేవీ ఆధ్వర్యాన శనివారం విశాఖ తీర ప్రాంతాలను శుభ్రపరిచారు. 600 నేవీ కుటుంబాలు పాల్గొన్నాయి. తీరంలోని ప్లాస్టిక్ సీసాలు, రేపర్లు, థర్మాకోల్, గాజు ముక్కలను సేకరించారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. 9 / 2023
సదరు:
తిరుమల విజయలక్ష్మి మరియు ఇతరులు . . . పిటిషనర్లు
మరియు:
SBI Mutual Funds (SBI) ...రెస్పాండెంట్
జనరల్ నోటీస్
ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, లేటు తిరుమల శ్రీనివాసాచార్యులు తేది:08-02-2019న చనిపోయిరి. ఆయన SBI Mutual Funds రూ. 10,07,707-76 i.e. 80,000 units Folio No. 19936789 వివరాలు గల షేర్లు సెక్యూరిటీలు కొనడం జరిగినది. లేటు తిరుమల శ్రీనివాసా చార్యులు కొన్న సెక్యూరిటీలు, అతని భార్య మరియు పిల్లలు చట్టపరమైన హక్కులు కలిగియుండి పై నెంబరు పిటిషను యందలి పిటిషనర్లు పేర ట్రాన్స్‌ఫర్ చేయుటకు SUCCESSION CERTIFICATE యిప్పించ వలసినదిగా కోరుతూ పై కోర్టులో దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనను ఏటువంటి ఆక్షేపణలు ఉన్ననూ తేది:02-05-2023న ఉదయం గం. 10-30 ని॥లకు స్వయంగా గాని మీ తరుపు వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీపరోక్షమున పై పిటిషనను శ్రీ కోర్టు వారు విచారించి తీర్మానం చేయుదురని తెలియ జేయడమైనది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
P.G.K.TEJASWI Advocate,
Visakhapatnam. Cell : 8187019661

పులుపెక్కిన నిమ్మకాయలు



భారీగా పెరిగిన ధరలు

వామ్మో అంటున్న వినియోగదారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవితాపం, మండుటెండల దెబ్బకు తడారిన గొంతులకు ఉపశమనానికి వేసవిలో దాహార్తి తీర్చుకునేందుకు నిమ్మకాయ నీరు, సోడాలను అధికంగా వినియోగించడం పరిపాటి. ఈ నేపథ్యంలో డిమాండ్ తగ్గట్టుగానే నిమ్మకాయల ధరలకూ రెక్కలొచ్చాయి.మామూలు సైజులో ఉన్న నిమ్మకాయ ధర ధర ఏకంగా రూ.5లు పలుకుతోంది అయినప్పటికీ కొంతమంది వినియోగదారులు కొంటున్నప్పటికీ, అనేక మంది ధరను చూసి నిమ్మకాయల వైపు చూసేందుకు ముఖం చాటేస్తున్నారు.

విశాఖ నగరానికి ఎక్కువగా ఏలూరు ప్రాంతం నుంచి నిమ్మకాయలు దిగుమతి అవుతుండగా, బస్తాలో 12వందల నిమ్మకాయలు ఉంటాయని, బస్తా ధర ఇపుడు ఏకంగా రూ.4,500కు పెంచేశారని వ్యాపారులు అంటున్నారు. ఈ లెక్కన బస్తా కొంటే ఒక్కో నిమ్మకాయ సైజుతో నిమిత్తం లేకుండా రూ.3.75పడుతుందని, దీనికి తోడు రవాణా, కళాసీలు, ఇతరత్రా ఖర్చులు, పాడైన నిమ్మకాయలు వీటన్నింటినీ లెక్కిస్తే, ఒక్కో నిమ్మకాయ రూ.5కు అమ్మినా గిట్టుబాటు కావడం లేదని వ్యాపారులు అంటున్నారు.

నేరాలు ఘోరాలు



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామానికి సమీపంలో ఉన్న జంక్షన్‌లో శనివారం 6 కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పద్మనాభం సిఐ సన్యాసినాయుడు శనివారం తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలానికి చెందిన జైగణేష్ (28), పద్మనాభం మండలం మద్ది గ్రామానికి చెందిన కాళ్ల ఉమా శంకర్ (22) గంజాయితో పట్టుబడినట్లు ఆయన చెప్పారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నక్కపల్లి :మండలంలోని కాగిత టోల్ గేట్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీన పరుచుకుని, స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శిరీష శనివారం తెలిపారు. ఒడిశాలోని ఐషర్ వ్యాన్ లో గంజాయిని లోడ్ చేసుకుని బంగాళా దుంపల లోడ్ కింద దాచి రాజమండ్రి వెళుతుండగా తనిఖీ చేసి స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. 88 కేజీల గంజాయిని స్వాధీన పరుచుకుని మధ్యప్రదేశ్ హీరాపూర్ గ్రామానికి చెందిన రాజా భయ్యా వర్మ, గంజాయి రవాణాకు సంబంధం ఉన్న తణుకు గ్రామానికి చెందిన ఈమంది శివ ధనుష్‌లను సీఐ నారాయణరావు అరెస్టు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారుగా లక్ష 76 వేలు ఉంటుందని ఎస్ఐ శిరీష వెల్లడించారు

గీతంలో ప్రోస్టోడాంటిక్ దంత నిపుణుల సమావేశం

ప్రజాశక్తి-మధురవాడ : దంత వైద్యంలో ప్రత్యేక విభాగంగా పేర్కొనే దంతాల పునరుద్ధరణ నిపుణులకు చెందిన ఇండియన్ ప్రోస్టోడాంటిక్ సొసైటీ 9వ రాష్ట్ర స్థాయి సమావేశాలు శనివారం గీతం దంత వైద్యకళాశాల, ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 115 మంది వైద్యులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. సమావేశాలను ఇండియన్ ప్రోస్టోడాంటిక్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.నరేంద్ర, కార్యదర్శి డాక్టర్ పి.శేషారెడ్డి ప్రారంభించారు. ప్రోస్టోడాంటిక్ వైద్యంలో నూతన పోకడలపై నిపుణులైన డాక్టర్ కె.మహేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ జంగాల హరి కీలక ప్రసంగాలు చేశారు. ఇండియన్ ప్రోస్టోడాంటిక్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని సైతం నిర్వహించినట్లు నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ వై.రవిశంకర్, కార్యదర్శి డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు.

10న పాలీసెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశ పరీక్ష మే 10వ తేదీన నిర్వహించనున్నట్లు భీమిలి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు టెన్త్ పాస్ అయిన వారు, ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 చివరి తేదీ అని తెలిపారు. ఒసి, బిసి విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 పరీక్ష ఫీజు చెల్లించాలని వివరించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో 120 మార్కులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి ప్రవేశం పొందిన వారు మాత్రమే ఉపకార వేతనం, ఫీజు రాయితీకి అర్హులని స్పష్టం చేశారు.

ఉచిత శిక్షణ

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 17 నుంచి మే 5వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ తెలిపారు. టెన్త్ పాస్ అయిన వారు, టెన్త్ పరీక్షలు రాసిన వారు శిక్షణా తరగతులకు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించు కావాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు 17వ తేదీన కళాశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రానున్న వ్యవసాయ సీజన్ నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.శివకోమలి స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో మట్టి నమూనాల సేకరణ, ఫలితాల ఆధారంగా మితిమీరిన ఎరువుల వాడకం తగ్గించి తద్వారా రైతులు నాణ్యమైన అధిక దిగుబడులు పొందేలా ప్రతి రైతు భరోసా కేంద్రం సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద ఏర్పాటుచేయనున్న 13 గ్రూపులకు గానూ 9 గ్రూపులు ఏర్పాటుచేశామన్నారు. మిగిలిన 4 గ్రూపులను వారం రోజుల వ్యవధిలో ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల సలహా మండలి సభ్యులకు సూచించారు. పిఎం కిసాన్, వైఎస్ఆర్ రైతు భరోసా లబ్ధిదారులు ఈ నెలాఖరు నాటికి ఇకెవైసి తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ఈ నెల 16 నుంచి మేకలు, గొర్రెలకు నట్టల నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ పి.వెంకటరమణ, ఉద్యాన శాఖ అధికారి పి.స్వాతి, ఆర్‌బికె సిబ్బంది జి.స్రవంతి, యు.శివకృష్ణ, డి.భువన ప్రత్యూష, పలువురు సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకోమలి

ప్రకృతి వ్యవసాయంపై కార్యాచరణ ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పథక సంచలకులు శోభారాణి

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రకృతి వ్యవసాయంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని డిఆర్‌డిఎ పథక సంచాలకులు శోభారాణి సూచించారు. ఆనందపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వైఎస్ఆర్ క్రాంతి పథకం బిఎన్ఎఫ్ సిబ్బంది కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శోభారాణి పలు విషయాలపై మాట్లాడారు. 2023-24 సంవత్సర కార్యాచరణలో సిబ్బంది ప్రతి ఇంటికీ ఇంటికి వెళ్లి సంవత్సర కాలంలో ఏ విధంగా వ్యవసాయాన్ని సాగుచేస్తున్నారనే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయుటకు అవసరమైతే మహిళా రైతులకు సిఐఎఫ్ నుంచి కానీ శ్రీనిధి నుంచి కానీ ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. డిపిఎం మోహనరావు మాట్లాడుతూ, రసాయన ఎరువులను విరివిరిగా వాడటం వల్ల ప్రజలకు కేన్సర్ వంటి ప్రాణాంతకర వ్యాధులు వస్తున్నాయని, సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వైదేహి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, మండల ఎపిఎంలు, సీసీలు జేడీఎం ప్రభావతి కల్యాణి పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను శనివారం విశాఖపట్నం పోర్టు ట్రస్టు చైర్మన్ రామచంద్రన్, జీవీఎంసీ కమిషనర్ సిఎం.సైకత్ వర్మ, కొచ్చిన్‌కు చెందిన జోనల్ స్కిల్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ పి.హేమలత దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందించారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : స్థానిక ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులను ముఖ్య అతిథిగా పాల్గొన్న నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కృష్టోఫర్ షార్ట్ అభినందించారు. వారి పట్టుదల, అంకిత భావం ఎంతో గొప్పదని ఆయన కొనియాడారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి ఎంబిబిఎస్ చివరి ఏడాది చదువుతున్న లీలా ధర మల్లా విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను చదివిన ఈ పాఠశాలకు చాలా కాలం తర్వాత రావడం ఎంతో అనుభూతి పొందినట్లు పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ అమిత్ జైన్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభ వెనుక వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి మాట్లాడుతూ, ఆత్మ విశ్వాసం ద్వారానే లక్ష్యాలను సాధించవచ్చని విద్యార్థులు నిరూపించారని తెలిపారు.

'మాలతాంబ'లో

పిఎం.పాలెం : పిఎం.పాలెం సమీపంలో ఉన్న మాలతాంబ విద్యానికేతన్‌లో ప్రీప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్-డే వేడుకలను పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాలతాంబ విద్యానికేతన్ సిఇఒ సునీల్ మహంతి హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా సునీల్ మహంతి మాట్లాడుతూ, విద్యార్థులను బాల్యం నుంచే ఉన్నతమైన ఆలోచనలతో తీర్చిదిద్దాలని, పిల్లల విద్యాబుద్ధుల పట్ల ఉపాధ్యాయులతోపాటు తొలి గురువులైన తల్లిదండ్రులు కూడా శ్రద్ధతీసుకోవాలని సూచించారు. మాలతాంబ విద్యానికేతన్ క్రమశిక్షణతో విద్యార్థుల ఉన్నత చదువులకు, భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపల్ పిఎం.రాజు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.గాయత్రీదేవి, ఏవో.ఆదిమూర్తి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ వేడుకల్లో విద్యార్థులతో సునీల్‌మహంతి తదితరులు

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

గాజువాక: జివిఎంసి 65వ వార్డు పరిధి గిరిజాకాలనీలో యుపిహెచ్‌సి ఆధ్వర్యాన శనివారం ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రియదర్శిని కాలనీ మీదుగా ప్రచార ర్యాలీ సాగింది. ర్యాలీలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు హాజరై మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా చాలామంది రోగాల బారిన పడుతున్నారని, ఇటువంటి సమయంలో వైద్యుల సూచనలు, సలహాలు తీసుకొని జాగ్రత్తలు పాటించాలని కోరారు. ధూమపానం, మద్యపానం, ఇతర మత్తు పదార్థాలకు దూరంంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి ఆరోగ్య సమస్య తలెత్తినా సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సతీష్, స్థానిక నాయకులు గిరి, గండి అప్పలరాజు, జానా సతీష్, పెంద్ర రాజు, అవంతి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి వెంకటసాయినగర్‌లో వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 94వ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరూ మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులు, బయట చిరు తిళ్లకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు బానిస కావద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పెందుర్తి వెంకటసాయినగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న యుపిహెచ్‌సి సిబ్బంది



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ప్రతినిధులు

జాబ్ మేళాలో 46 మంది ఎంపిక

ప్రజాశక్తి- కంచరపాలెం : విశాఖ జిల్లాలోని ప్రముఖ సంస్థలలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 106 మంది నిరుద్యోగులు హాజరుకాగా 46 మంది ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బిఐ లైఫ్ ఇన్స్యూరెన్స్ లిమిటెడ్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్, స్మార్ట్ సర్వీసెస్ పేటీఎం, మహావీర్ గ్రూప్ స్కోడా, కాలిబర్ సపోర్ట్ సర్వీసెస్ సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు వివరించారు. ఎంపికైన వారికి వారం రోజులలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి నియామక ఉత్తర్వులు ఇస్తారని పేర్కొన్నారు.


ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

ఫుట్ ఓవర్ బ్రిడ్జికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-పెందుర్తి : రాంపురం గ్రామం జాతీయ రహదారిలో రూ.2.4 కోట్లతో ఏర్పాటుచేయనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు శనివారం స్థల పరిశీలన చేశారు. ప్లానింగ్ తదితర అంశాలపై ఎన్‌హెచ్-16 అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ, ఈ పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, నేషనల్ హైవే ఇంజినీర్ వేణు, కాంట్రాక్టు మనోహర్, దిలీప్, రమణమూర్తి తదితరలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్-3 పరిధి 15, 16, 23 వార్డులలో పలు అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించినట్లు టిపిఎస్ తేజ తెలిపారు. 15వ వార్డులో సింహాద్రిపురం, 16వ వార్డులో కెఆర్ఎం.కాలనీ, ఇసుకతోట, 23వ వార్డులో చైతన్యనగర్, నక్కవానిపాలెం మెయిన్ రోడ్డులో పలు అక్రమ నిర్మాణాలు జరుగుతుండటంతో వాటిని తొలగించినట్లు ఆయన చెప్పారు. తమ ప్లాను ప్రకారం భవనాలను నిర్మించుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, చైన్‌మ్యాన్ పాల్గొన్నారు.


తగరపువలసలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్నిప్రమాదాల నివారణకు ప్రచారం

ప్రజాశక్తి -తగరపువలస : అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిట్టివలస అగ్నిమాపక అధికారులు, సిబ్బంది శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలను ఎలా నివారించవచ్చో మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి జి.శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుళ్లు జివిఎస్‌కె.రెడ్డి, టి.వెంకటరావు, కె.చక్రవర్తి, డ్రైవర్ ఆపరేటర్లు సిహెచ్‌విఆర్ మూర్తి, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పతనం తథ్యం : టిడిపి


'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'లో పాల్గొన్న కోరాడ రాజబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రానున్న ఎన్నికల్లో వైసిపి పతనం తప్పదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు జోస్యం చెప్పారు. మండలంలోని తాళ్ళవలసలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' పేరిట శనివారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైసిపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, ఆర్టీసీ బస్సు చార్జీలు, ఆస్తి పన్ను పెంపు, చెత్త పన్ను విధింపు ఇలా ప్రజలపై ఆర్థిక పరమైన భారాన్ని మోపినట్లు విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, ఎంపిటిసి సభ్యులు కోరాడ రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సరగడ అప్పారావు, తెలుగు యువత ఉపాధ్యక్షులు పాసి త్రినాధ్ కుమార్ పాల్గొన్నారు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -యంత్రాంగం

జివిఎంసి పరిధిలో పలుచోట్ల శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

13వ వార్డులో

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి శివాజీనగర్-2లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత నేతృత్వంలో తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, మహిళా అధ్యక్షులు శిరీష, పిల్లి వీర్రాజు, బేత దుర్గారావు, పాండ్రంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శోంఠ్యాంలో

ఆనందపురం: ఆనందపురం మండలం శోంఠ్యాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ ప్రజలను కలిసి సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బంక సత్యం, వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, సర్పంచ్ లంక లావణ్యరాంబాబు, గన్‌రెడ్డి శ్రీను, కోరాడ ముసలి నాయుడు, చందక అప్పలస్వామి, పినిశెట్టి సింహాచలంనాయుడు, బలిరెడ్డి మహేష్ పాల్గొన్నారు.


శోంఠ్యాంలో...


46వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కెకె.రాజు

46వ వార్డులో

సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి శాంతినగర్ కైలాసపురం, శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇంత వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి ఎం.సునీల్, డైరెక్టర్ రాయుడు శ్రీను, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు తమ సమస్యలతో కూడిన వినతులను కెకె.రాజుకు అందించారు. వినతులను పరిశీలించిన కెకె.రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి నాయుడుతోటదరి కృష్ణానగర్‌లోని విజయగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజు, గణబాబు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాస్, 93వ వార్డు కార్పొరేటర్ కన్నా, కిషోర్, ఆదిరెడ్డి మురళి, దాసరి సత్తిబాబు, వినోద్, శ్రీకాంత్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

తర్లువాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నూతన విగ్రహాన్ని కాలనీ యువత ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల జనసేన నాయకులు మజ్జి శ్రీను హాజరై మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, బాలి అప్పలరాజు, బాలి అయ్యప్ప, తాట్రాజు అప్పారావు, మజ్జి రమేష్‌నాయుడు, బాలి రవికుమార్, కోరాడ కృష్ణారావు, చందల అప్పలరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

శోభాయాత్ర

ప్రజాశక్తి -కరాస: 52వ వార్డు పరిధి కరాస నుంచి బీచ్ రోడ్డులోని కాళీ మాత టెంపుల్ వరకు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 56వ వార్డు కార్పొరేటర్ సరగడం రాజశేఖర్, శేఖర్, శ్రీను, ఆంజనేయ స్వామి గుడి ధర్మకర్తలు పొట్నూరు అప్పారావు, కోటానీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కల్వర్టులను పునర్నిర్మించాలని సిపిఎం నిరాహార దీక్ష

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం-అనకాపల్లి ప్రధాన రహదారిలో గోవాడ, వెంకన్నపాలెం వద్ద కల్వర్టులు శిథిలమై ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని పునర్నిర్మించాలని, రక్షణ గోడలు నిర్మించాలని కోరుతూ సిపిఎం చోడవరం మండల కమిటీ ఆధ్వర్యంలో వెంకన్నపాలెం కల్వర్టు వద్ద శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, నాయకులు ఎస్‌వి.నాయుడు, రొంగలి దేముడు నాయుడు, ఈ.నర్సింహమూర్తి, జి.దేముళ్లు, కోటి, నంబారు మాలినాయుడు, జె.శ్రీనివాస్, కె.జాన్ దీక్షల్లో కూర్చున్నారు. ఈ దీక్షలను సీపీఎం జిల్లా నాయకులు గంటా శ్రీరామ్ ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నడుపూడి దేముడు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారుల నుండి సంతకాల సేకరణ చేశారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఈ మార్గంలో వెళ్తూ సంతకం చేసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ అనకాపల్లి, పాడేరు, విశాఖ జిల్లాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గంలో రోజూ వేలాది మంది ప్రయాణిస్తున్నారని, అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారని తెలిపారు. సుమారు ఏడాది కాలంగా కల్వర్టులకు రక్షణ గోడలు పడిపోయిన, బ్రిడ్జి కూలిపోయే స్థితిలో ఉన్నా స్థానిక ఎమ్మెల్యే అయిన ప్రభుత్వ విప్, జిల్లా మంత్రులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రధాన రహదారిలో కల్వర్టులు చాలా ఇరుకుగా ఉండడం నిత్యం ప్రమాదాలకు, ట్రాఫిక్ అంతరాయానికి కారణంగా ఉందన్నారు. ప్రయాణికులు, ప్రజల ప్రాణాలకు ఏదైనా హాని జరక ముందే స్పందించి కల్వర్టులను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సిపిఎం మండల నాయకులు ఎస్‌వి.నాయుడు



మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జిల్లా న్యాయమూర్తి గోపి

పర్యావరణాన్ని పాడుచేస్తే జీవజాతికి ముప్పు

ప్రజాశక్తి-చోడవరం

పర్యావరణాన్ని పాడు చేస్తే జీవజాతికి పెనుముప్పు సంభవిస్తుందని ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. చోడవరం కోర్టుకు శనివారం పరిశీలనకు వచ్చిన ఆయన బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మనిషి అడవులు, చెట్లు నాశనం చేయడం వల్ల జీవజాతుల ఆవాసాలు దెబ్బతిని అవి జనసంచారంలోకి వస్తున్నాయని తెలిపారు. ప్రతి మనిషిలోనూ అహంకారం, అసూయ, అత్యాశ వంటివి ఉంటాయని, వాటికి దూరంగా ఉంటూ ఉన్నదాంట్లోనే సంతృప్తి పడడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. చోడవరం కోర్టు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపుతామని, చోడవరంలో ఏర్పాటు చేయనున్న జిల్లా కోర్టు భవనాలను పూర్తి చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాండ్రేకుల డేవిడ్ స్థానిక సమస్యలను జడ్జి ముందు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ఎం ఫణికుమార్, చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అదనపు జూనియర్ జడ్జి ఉమాదేవి, న్యాయవాదులు మంతా గౌరీ శంకర్, కృష్ణవేణి, ప్రకాష్ రావు, నళిని, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

తాగునీటి అవసరాలు తీర్చేందుకు బోర్లను ఏర్పాట్లు చేస్తున్నట్లు బుచ్చయ్యపేట జడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు తెలిపారు. శనివారం మండలంలోని కేపి అగ్రహారం గ్రామంలో దేవర వారి కల్లాల వద్ద జడ్పిటిసి నిధులతో మంచినీటి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, మండల నాయకులు దాకారపు నాగరాజు, ఎంపిటీసీలు ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, ఉప సర్పంచ్ దేవర ముసలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశం

ప్రజాశక్తి -కశింకోట

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. అచర్ల, గొకివానిపాలెం, మోసయ్యపేట గ్రామంలో జగనన్న లే ఆవుట్లను పరిశీలించారు. ఎంతమంది కడతన్నారు, ఎంత మంది కట్టడం లేదో అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలవారీగా జరుగుతున్న ఇల్లు నిర్మాణం పనులు, వారికి మంజూరు చేసిన స్థలాలపై చర్చించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. ఏయే పనులు జరుగుతున్నాయి, ఎంత గిట్టు బాటు వస్తుందో అడిగి తెలుసుకున్నారు. చింతలపాలెంలో భూమి ఆక్రమణకు గురుకాకుండా సర్వే రాళ్ళు పాతాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రోజారాణి, ఎంపిడిఒ కొంకి అప్పారావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్ నాయుడు, హౌసింగ్, రెవెన్యూ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

పరీక్ష కేంద్రం పరిశీలన

కశింకోటలోని బాలురు, బాలికలు హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారో తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంపై ఆరోపణలు రాకుండా ఉపాధ్యాయులు, ఇన్విజలేటర్లు వ్యవహరించాలని సూచించారు.

పరీక్షలు ముగియడంతో విద్యార్థుల్లో ఉత్సాహం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

పదవ తరగతి పరీక్షలు శనివారం ముగియడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల నుండి వస్తూ ఉత్సాహంగా కనిపించారు. సంస్కృతం సబ్జెక్టు ఉన్న విద్యార్థులు మినహా మిగిలిన టెన్త్ విద్యార్థులకు శనివారంతో పరీక్షలు ముగిశాయి. దీంతో మండలంలోని దిబ్బిడి, వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు శనివారం ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

కోడికత్తి కేసులో జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

కోడికత్తి కేసులో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కోడి కత్తి కేసుపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) చేపట్టిన దర్యాప్తులో ఎటువంటి నేరపూరిత ఘటన లేదని, తెలుగుదేశం పార్టీకి ఈ ఘటనతో సంబంధం లేదని తేల్చి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ విమానాశ్రయంలో సీసీ కెమెరాలు పనిచేయలేదని జగన్ రెడ్డి చేసిన మరో ఆరోపణ ఎంత మాత్రం నిజం కాదని, నాడు అన్ని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయని వెల్లడించిన విషయం ద్వారా జగన్ రెడ్డి కపటనాటకం బయటపడిందని పేర్కొన్నారు. తన చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో కూడా జగన్ రెడ్డి ప్రచారాలు అబద్ధాలేనన్నారు. ఆరు దశాబ్దాలుగా మార్గదర్శి చిట్ ఫండ్ కంపెనీ వేలాది మంది ఉద్యోగులతో పనిచేస్తూ లక్షలాది మంది చందాదారులకు లబ్ది చేకూరుస్తుందని, అటువంటి సంస్థపై జగన్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు దిగడం అమానుషమని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆళ్ల రామచంద్రరావు, కుప్పిలి జగన్మోహన్, బొడ్డేడ మురళి, డాక్టర్ నారాయణరావు, కొట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటోమేటిక్ పవర్ జనరేషన్ యంత్రం రూపకల్పన

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండవ సంవత్సరం విద్యార్థులు ఎలక్ట్రో మాగ్నెటిక్ సస్పెన్షన్ ద్వారా ఆటోమేటిక్ పవర్ జనరేషన్ యంత్రాన్ని రూపొందించారు. ఆధునిక జీవన శైలిలో విద్యుత్ వినియోగాలకే కాకుండా వాహనాల స్పీడు, ఫ్రిక్షన్ బట్టి వాటికి వినియోగించే ఎలక్ట్రో మాగ్నెటిక్ సస్పెన్షన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఈ విద్యుత్తును రీఛార్జ్ అయ్యే బ్యాటరీకి అనుసంధానం చేయడం ద్వారా ఆ విద్యుత్తును మనకు అవసరమైనప్పుడు వినియోగించుకునే అవకాశం ఉందని ప్రాజెక్టు ఇంజనీర్ బి శేషగిరిరావు తెలిపారు. తమ విద్యార్థులు ఏ ఉమామహేశ్వరరావు, వి లీల, నాగసాయి ఈ ప్రాజెక్టును కేవలం 1000 రూపాయల ఖర్చుతో రూపొందించారని తెలిపారు. ప్రాజెక్టు గైడ్‌గా కళాశాల అధ్యాపకులు డాక్టర్ మైత్రి వ్యవహరించారన్నారు. హెచ్ఒడి డాక్టర్ పి.పూర్ణ ప్రియ ప్రోత్సాహంతో ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేసినట్టు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు ప్రశంసించారు.



తయారు చేసిన యంత్రాన్ని చూపుతున్న విద్యార్థులు

పనులు కల్పించకపోతే ఉరి వేసుకుంటాం

రుషిల్ డెకార్ ప్లైవుడ్ కార్మికుల వినూత్న నిరసన



మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌లోని రుషిల్ డెకార్ పరిశ్రమలో పని కల్పించకపోతే ఉరి వేసుకుంటామని ఆ కంపెనీ ముఠా కార్మికులు పరిశ్రమ యాజమాన్యాన్ని హెచ్చరించారు. 11వ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ ఆవరణలో శనివారం ముఠా కార్మికులు ఉరితాళ్లు బిగించుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం, ఎమ్మెల్యే కుమ్మక్కై నిర్వాసితులుగా ఉన్న ముఠా కార్మికుల పొట్టలు కొట్టే విధంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని ఉధృతం చేయకముందే లేబర్ కమిషనర్, ఏపీఐఐసీ అధికారులు కల్పించుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జరగబోయే పరిణామాలకు పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొర్లి సత్తిబాబు, అప్పలనాయుడు, సూరిబాబు, గణేష్, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సిఐటియు వినతి

తమకు పని కల్పించాలని రుషిల్ డెకార్ ప్లైవుడ్ పరిశ్రమ ముఠా కార్మికులు 11 రోజులుగా ఆందోళన చేస్తున్నారని, వెంటనే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని అనకాపల్లి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సువర్ణకు సిఐటియు నాయకులు శనివారం విన్నవించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ 2019 సంవత్సరంలో పరిశ్రమ యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కూలి రేట్లు యథావిధిగా కొనసాగించాలని కోరారు. పరిశ్రమ స్థాపనకు భూములు ఇచ్చి నేడు ఉపాధి కరువై రోడ్లపై ఆకలితో అలమటిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం చాలా విచారకరమన్నారు. ఆనాడు రైతులు ఉదారంగా భూములు ఇవ్వని పక్షంలో నేడు పరిశ్రమలు ఎక్కడ ఉండేవని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు నాయనిబాబు

చెరుకు రైతులకు వెంటనే పేమెంట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి చెరుకు సరఫరా చేసిన రైతులందరికీ పేమెంట్లు వెంటనే ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ముగిసి నెలలు గడుస్తున్నా రైతులకు పేమెంట్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన 15 రోజుల్లో పేమెంట్ ఇవ్వాలని నిబంధనలో ఉన్నా దానిని ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చెరుకు రైతులకు ఫ్యాక్టరీ ఇస్తున్న ప్రస్తుత ధర ఏమాత్రం చెరుపోలేదని, టన్నుకు రూ.5 వేలు ఇస్తేగాని రైతుకు గిట్టుబాటు కాదని పేర్కొన్నారు. ఇస్తున్న తక్కువ ధర అయినా సరే సకాలంలో ఇవ్వకపోవడంతో రైతులు వ్యవసాయ పెట్టుబడులకు దళారులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, గాడి ప్రసాదు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చొరవతో 84వ వార్డు గొల్ల వీధిలో ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న లోవోల్టేజి సమస్య పరిష్కారమైంది. స్థానికులు లోవోల్టేజి సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి ఏపీ ఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు శనివారం కొత్తగా 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో లోఓల్టేజీ సమస్య తీరింది. ఇందుకు సహకరించిన మంత్రి అమర్నాథ్‌కు 84 వార్డు వైసిపి ఇన్చార్జ్ కోరుకొండ రాఘవ, స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, స్థానిక వైసిపి నాయకులు మొగలపల్లి రవితేజ, ముమ్మిన పైడిరాజు, వాయబోయిన నాగు, మంత్రి మాధవరావు, వాసు, పేరపు రాంబాబు, పూడి సూరిబాబు పాల్గొన్నారు.

నువ్వు యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - యలమంచిలి : నువ్వు పంట యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన శనివారం మండలంలోని తురంగపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలిత ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి స్థానిక నూనె విత్తన పరిశోధన కేంద్రం రూపొందించిన రైతులకు అధిక దిగుబడినిచ్చే శారద రకం నువ్వుపంట క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం రైతులకు విత్తనశుద్ధికి అవసరమైన ట్రైకోడెర్మాను ఉచితంగా అందజేశారు. ఆత్మ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విత్తన పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తులసిలక్ష్మి, సైంటిస్ట్ ఎబిఎం శిరీష, వివిఎ స్వాతి, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా శారద రకం నువ్వు పంట తొలిసారిగా వేసిన రైతులకు విత్తనాలు నిల్వచేసుకొనే హెర్మొటిక్ సంచులు, రెక్కల పురుగులు నివారించే ఎల్లో స్టిక్ జిగురు అట్టలు పంపిణీ చేశారు.



నువ్వు పంటపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

భూసార పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

భూసార పరీక్ష, శిక్షణ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాల సేకరణపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

మునగపాక రూరల్ : మండలంలోని ఒంపోలు గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద భూసార పరీక్షలపై ఆర్‌బికె సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనకాపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం రామారావు మాట్లాడుతూ మట్టి నమూనాలు తీసుకొని పరీక్ష చేయించి, వచ్చిన ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. మట్టి నమూనాలు ఏ విధంగా తీసుకోవాలో తెలియజేశారు. ఈ పరీక్షల ఆధారంగా 16 రకాల పోషకాలు భూములు ఏయే మోతాదులో ఉంటాయనిది తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి



ఒంపోలులో భూసార పరీక్షలపై శిక్షణ ఇస్తున్న అధికారులు

జోష్నకుమారి, ఏఈఓ లక్ష్మి, వివిఎలు, విహెచ్‌ఎలు, ట్రైనింగ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బికే సిబ్బంది భూసార పరీక్షలపై అవగాహన కల్పించి, తదుపరి మట్టి నమూనా సేకరణ విధానాన్ని క్షేత్రస్థాయిలో వివరించినట్లు వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. గ్రామాల్లో పంటల విస్తీర్ణానికి అనుగుణంగా మట్టి నమూనాలను సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చరల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ చీపురుపల్లి సూర్యనారాయణ, ఏఈఓ బాలరాజు, లెక్కల రామానాయుడు, కిల్లి దేముడు బాబు, బోకం సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండల కేంద్రం బుచ్చయ్యపేటలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి భాస్కరరావు మాట్లాడుతూ భూసార వారోత్సవాలలో భాగంగా మట్టి పరీక్ష నమూనాల సేకరణ పై అవగాహన, మట్టి పరీక్షల వల్ల రైతులకు కలిగే లాభాలు, పంట పొలాలు బాగుపరచుకునే అవకాశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఆర్‌బికె పరిధిలోని పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి వాటిని అనకాపల్లి పరిశోధన కేంద్రానికి పంపాలని తెలిపారు.

నర్సీపట్నం టౌన్ : మండలంలో ఆర్‌బికే సిబ్బందికి భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణపై శిక్షణా



బుచ్చయ్యపేటలో నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డి.అప్పారావు మాట్లాడుతూ, పంటను వేసే ముందు మట్టి నమూనా పరీక్షించడంతో నేలలో తగ్గిన పోషకాలను తెలుసుకొని పంట వేసినప్పుడు వాటిని ఎరువుల రూపంలో అందిస్తే మంచి దిగుబడి వస్తాయని తెలిపారు.

కోటవురట్ల : రైతులంతా భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగానే ఎరువుల యాజమాన్యం పద్ధతులు పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు టీఎస్ రాజకమల్ సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ఇన్చార్జ్ మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ కమల్ మాట్లాడుతూ, మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థాలు అవసరమని, మోతాదుకు మించి వాడితే ఖర్చు పెరగడమే కాకుండా ఆదాయం దిగుబడి కూడా తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కిల్లాడ శ్రీనివాసరావు, గొల్లు చిట్టిబాబు, రైతులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు స్పందన : పంచకర్ల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా పీపుల్స్ సర్వే పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గుర్తింపు దక్కుతోందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు అక్కరమాని విజయనిర్మల, కెకె.రాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : జివిఎంసి 41వ వార్డు దొండపర్తి కుప్పిలి వారి వీధిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ నేతృత్వంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతీ గడపకు లబ్ధి చేకూరిందని ఎంపీ వెంకట సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబురావు, నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. మండలంలోని ఉపమాక గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు - నువ్వే మా నమ్మకం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, నక్కపల్లి సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, ఎంపీటీసీలు కొల్లాటి పార్వతి, బుజ్జి, మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి హరిబాబు, నాయకులు పాపారావు, నరసింహమూర్తి, మణి రాజు, తాతారావు పాల్గొన్నారు.

వడ్డాది: బుచ్చయ్యపేట మండలం మంగళాపురం పంచాయతీ కుముందానుపేట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ సారధులు కోవెల ఆదెమ్మదొర, ప్రకాష్‌లు సిఎం జగన్ అందిస్తున సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. పంథకాలు పంపిణీపై లబ్ధిదారులను అడిగి



కుముందానుపేటలో వైసిపి నేతల ప్రచారం



సబ్బవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సయ్యపురెడ్డి ఆనంద్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : జగనన్నే మన భవిషత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ వైసీపీ నేతలను ఆదేశించారు. సబ్బవరం పార్టీ కార్యాలయంలో శనివారం వైసీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైసిపి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు కలిసి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వల్ల నేరుగా ప్రజలకు ఏ విధంగా లబ్ధి చేకూరిస్తుందో వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, జెసిఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కోటాన రాము, పార్టీ మండల అధ్యక్షులు కర్రి బాబు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి - యలమంచిలి : ఎండలు ముదిరి అగ్నిప్రమాలు జరిగితే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచేవిధంగా అగ్ని మాపక సిబ్బంది శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాదం జరిగినపుడు తాము తీసుకొనే చర్యలను డిమాన్‌స్ట్రేషను చేసి ప్రజలకు వివరించారు. మైక్‌లో తీసుకోవవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాల్లోని షాపు ఓనర్లను కలిసి అగ్ని పోర్టల్ యాప్ గురించి వివరించి డౌన్‌లోడ్ చేసుకొనే విధానంపై అవగాహన కల్పించారు. కరపత్రాలు విరివిగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఫైర్ ఆఫీసర్ డి.రాంబాబు, షాపు యజమానులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గ్రామస్తులు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. మహిళలు కోలాటంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎస్ కాశి నాయుడు, భీముని నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీబాల దుర్గ యంగ్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యాశాఖ ఏడి ఆడారి రవిబాబు చేతులమీదుగా వికలాంగులఅకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ రవిబాబు మాట్లాడుతూ విజ్ఞానాన్ని విప్లవంగా మార్చుకున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చరిత్రలో నిలిచిపోయిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. కార్యక్రమంలో దాతలు వియ్యపు అప్పారావు, పివిఎం నాగజ్యోతి, సూరిశెట్టి రాముడు, రాజాన దొరబాబు, ప్రజా రాజకీయ వేదిక వ్యవస్థాపకులు కనిశెట్టి సురేష్ బాబు, తుమ్మపాల ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రపల్లి వీరు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండను బౌద్ధ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం శంకరం బొజ్జన్న కొండను బౌద్ధ పర్యాటక కేంద్రంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయాలని బర్మా దేశపు బౌద్ధ భిక్షువు వినరబుల్ ఆయుపాల్ మహా థేరోబాంతేజీ పేర్కొన్నారు. శంకరం బొజ్జన్న కొండను శనివారం ఆయన సందర్శించారు. ప్రధాన గుహలో బౌద్ధ స్తూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. తదుపరి బొజ్జన్న కొండపై ఉన్న బౌద్ధ శిల్పాలను చూసి ఆనంద పరవశులయ్యారు. బొజ్జన్న కొండ విశిష్టతను, చారిత్రక ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. ఎంతటి ప్రాచీన చారిత్రక విశిష్టతగల బజ్జన్న కొండను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పరచి బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య కార్యదర్శి బోరా వేణుగోపాల్ గౌతమ్, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం, బుద్ధిష్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు నేలపూడి బాలరాజు, బోరా లోకేశ్వరరావు, పళ్ళ బాబ్జి, వి దేముడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అధిక నిధులు

అనకాపల్లి ఎంపీ వెంకట సత్యవతి

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గానికి అత్యధికంగా ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ వెంకట సత్యవతి తెలిపారు. మండలంలోని ఉపమాక గ్రామంలో సీసీ డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి శనివారం ఎమ్మెల్యే గొల్ల బాబురావు, నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్యలతో కలిసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డ్రైన్ల నిర్మాణానికి ఎంపీ నిధుల నుండి రూ.9.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే బాబురావు తన దృష్టికి తీసుకు రావడంతో ఎంపీ నిధుల నుండి కోటి రూపాయల వరకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ, ఉపమాక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఇప్పటికే ఉపమాక పంచాయతీ శివారు గ్రామాలకు రోడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంటింటికి కుళాయి పథకం తీసుకు వచ్చినట్లు తెలిపారు. ముందుగా మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరిబాబు గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీ ,ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. నక్కపల్లి నుండి ఉపమాక వరకు ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేయాలని, ఇండ్ల స్థలాల మంజూరు, రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు గాను కొప్పిశెట్టి హరి, ఎంపీటీసీ సభ్యులు కొల్లాటి పార్వతి, బుజ్జీలను ఎంపీ, ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కొల్లాటి పార్వతి, బుజ్జి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరిబాబు, నాయకులు పాపారావు, నరసింహ మూర్తి, మణి రాజు, తాతారావు, సత్తిబాబు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-మాడుగుల:ఆర్థికంగా వెనుక బడి చదువులో రాణించాలని కోరుకునే విద్యార్థులకు సృజనవాని స్వచ్ఛంద సంస్థ అండగా నిలబడుతుందని ఆ సంస్థ ప్రతినిధులు గ్యాని, రామారావు తెలిపారు. గత 8 సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశానికి గాను ఉచితంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని విద్యార్థులకు ఈ అవకాశం కల్పించడం జరిగిందని, ఇదే మాదిరిగా ఈ ఏడాది సైతం ఈనెల 17వ తేదీ నుండి మే 8వ తేదీ వరకు మాడుగుల ప్రాంతంలోని 12 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సంస్థ కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణకు 60 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.ఆన్లైన్ యాప్ ద్వారా ఉచితంగా పాలిటెక్నిక్ శిక్షణ అందించడం జరుగుతుందని మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాళ్లపురెడ్డి నాగచంద్ర తెలిపారు.



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్ల భారీ ర్యాలీ

ప్రజాశక్తి -రావికమతం: విధి నిర్వహణలో ఉన్న గ్రామ వాలంటీర్స్ పై దాడులకు పాల్పడ్డ వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ మండల కేంద్రంలో వాలంటీర్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రావికమతం మండల వాలంటీర్స్ యూనియన్ నాయకుడు ప్రగడ నాయుడు బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం వాలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకే అందిస్తుందన్నారు.గ్రామాలలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వాలంటీర్స్ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కొంతమంది నాయకులు అసూయతో తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఇటీవల బుచ్చయ్యపేట మండలం నీలకంఠపురం గ్రామంలో పడాల శివ అనే గ్రామ వాలంటీర్ విధి నిర్వహణలో భాగంగా ఇంటి పన్ను కట్టమని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల వద్దకు వెళ్లి అడిగినప్పుడు వారు అతనిపై దాడి చేయడం సరికాదన్నారు. ఇటువంటి దాడులు పునరావృతమైతే జిల్లా స్థాయిలో భారీ ఉద్యమం చేపట్టడం తథ్యమని ఆయన హెచ్చరించారు. అనంతరం తరం ఎంపీడీవో వెంకన్న బాబు, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఉమామహేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి- రావికమతం:మండలంలోని గుమ్మాల పాడు, పిల్లవానిపాలెం గ్రామాల్లో శనివారం రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 140 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ కె.హేమ సుందర్‌రావు, గుడివాడ గ్రామ సర్పంచ్ గుమ్మాల శంకర్రావు, ఆశా వర్కర్ రవణమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:రోడ్డు భద్రతా వారోత్సవాలపై శనివారం గొలుగొండ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ, ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇద్దరికి మించి ప్రయాణం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనం నడుపరాదన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

విభిన్న ప్రతిభావంతులకు ఉపకార వేతనాలు మంజూరు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో 9, 10 వ తరగతి చదువుతున్న 34 మంది దివ్యాంగ విద్యార్థులకు 2022-23 విద్యా సంవత్సరానికి గాను (నేషనల్ స్కాలర్‌షిప్) జాతీయ ఉపకార వేతనాలు మంజూరు అయ్యాయని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడు , ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు తెలిపారు. 2022-23 సంవత్సరానికి గాను జాతీయ ఉపకార వేతనాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ఒకటి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 16 మంది దివ్యాంగ విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల చొప్పున ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ రూ.48 వేలు, 36 మంది దివ్యాంగ విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల చొప్పున ఎస్కార్ట్ అలవెన్స్ 1లక్ష 8,000, 9 మందికి ఒక్కొక్కరికి 3000ల చొప్పున హెూమ్ బేస్డ్ అలవెన్స్ రూ.27 వేలు, 46 మందికి ఒక్కొక్కరికి రూ.2000ల చొప్పున గర్ల్స్ స్టైఫండ్ రూ.92,000 లను వారి తల్లి అకౌంట్ లో అమౌంట్‌ని జమ చేయడం జరిగిందన్నారు.దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా విద్యను అందించడంతో పాటు ఉపకరణాలను అందించడం జరుగు తుందన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి-నక్కపల్లి:వేగవంతంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి కె రమామణి సూచించారు. మండలంలోని ఉపమాక గ్రామంలో శనివారం జగనన్న లే అవుట్ ను ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్డి వెంకటనారాయణ, హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరతగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పేమెంట్లు మంజూరులో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. జగనన్న కాలనీలో విద్యుత్, నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు .

మాడుగుల:జగనన్న లే ఔట్లలో నిర్మాణం అవుతున్న గృహాలను శనివారం అధికారులు పరిశీలించారు. మండలంలోని జంపిన, ఎం.కృష్ణాపురం గ్రామాలలో గృహాలను ఎంపీడీవో మీనా కుమారి, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ తదితరులు పరిశీలించారు. జంపెన లో 13 గృహాలు, ఎం కష్ణాపురంలో 32 గృహాలు నిర్మాణం అవుతున్నాయని వీటిని త్వరితగిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఇంకా మొదలుకాని అనేక ఇళ్ళను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు



పరిశీలిస్తున్న అధికారులు


వాకౌట్లతో అర్ధాంతరంగా ముగిసిన

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



బయటకు వెళ్లిపోయిన సభ్యులతో బోసిపోయిన హాల్

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్:మున్సిపల్ చైర్ పర్శన్ గుడబండి ఆదిలక్ష్మి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కొద్ది సేపటికే ముగిసింది. ఎజెండా చదవడం ప్రారంభించకుండానే 26వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ఎజెండాలోని అంశాల పట్ల అభ్యంతరాలు ఉన్నాయని, అభ్యంతరాలను చదివి వినిపించారు. వీటిని తాము వ్యతిరేకిస్తున్నామంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ మున్సిపల్ సమావేశం నుండి వాక్ అవుట్ చేశారు. అనంతరం జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మున్సిపాలిటీలో అవినీతి ఎక్కువైపోయిందని అధికారులపై తీవ్ర విమర్శలు చేశారు. ఆమె మాట్లాడకుండానే వైసిపి కౌన్సిలర్లు కూడా లేచి సభ బయటకు వెళ్లిపోయారు. ఈ సమయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మీ ఎజెండాలో పేర్కొన్న అంశాలను ఆమోదిస్తునట్లు ప్రకటించి ఆమె కూడా సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు.దీంతో సమావేశం నిమిషాల వ్యవధిలో అర్ధాంతరంగా ముగిసింది. అనంతరం మున్సిపల్ కార్యాలయం బయట మీడియా ముందు తెలుగుదేశం, వైసిపి, జనసేన కౌన్సిలర్లు మీడియాతో మాట్లాడుతూ పరస్పర ఆరోపణలకు తెరలేపారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, మార్చి లోపుగా ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్ ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. వేసవికాలం మొదలై చాలా రోజులు గడిచిపోతున్నా, ఇంతవరకు మంచినీటి సమస్య పరిష్కారానికి ఎజెండాలో ఎందుకు పెట్టలేదని నిలదీశారు. ఇంటింటికి కుళాయిలు పేరుతో రోడ్లన్నీ తవ్వేసి అస్తవ్యస్తంగా చేశారని, కోట్ల రూపాయల ఖర్చు పెట్టి వేసిన రోడ్లన్నీ నాశనం చేశారని విమర్శించారు. ప్రధాన రోడ్డు వెడల్పులో నష్టపోతున్న వారికి టిడిఆర్ బాండ్లు వద్దని, నగదు రూపంలో పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, ప్రజలు కట్టిన ఆస్తి పన్నును అధికారులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. అభివృద్ధి ఊసే లేదని దుయ్యబట్టారు. గత రెండు సంవత్సరాలుగా చెత్త సమస్య పరిష్కారానికి నోచుకోలేదని , ట్రాక్టర్లకు డీజిల్ లేని దుస్థితిలో మునిసిపాలిటీ ఉందని ఆమె విమర్శించారు.



మాట్లాడుతున్న పద్మావతి

అనంతరం వైసిపి కౌన్సిలర్లు మాట్లాడుతూ, నర్సీపట్నం అభివద్ధి చెందడం తెలుగుదేశం కౌన్సిలర్లకు ఇష్టం లేదని, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కు మంచి పేరు వస్తుందని రోడ్డు విస్తరణ లో నష్టపోతున్న వ్యాపారులను రెచ్చ గొడుతున్నారన్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని అభివద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటు న్నారన్నారు. టి డి ఆర్ లతో ఎవరికి నష్టం జరగదని, బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. నర్సీపట్నం అభివద్ధికి తెలుగుదేశం కౌన్సిలర్లు సానుకూలమా?



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిఎల్‌డిఒ

సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం

ప్రజాశక్తి -కోటవురట్ల: బయోమెట్రిక్ వేసి జీతాలు తీసుకునేందుకేనా? అని సచివాలయ సిబ్బంది పనితీరుపై అనకాపల్లి డిఎల్‌డివో మంజుల వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె మండల సమావేశం మందిరంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ పై నిర్వహిస్తున్న సర్వే వివరాలు పూర్తిస్థాయిలో సిబ్బంది నిర్వహించకపోవడం పట్ల ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి నిర్వహిస్తున్న సర్వే నేటికీ పూర్తి స్థాయిలో చేయకపోవడంపై సర్వేపై మీకు అవగాహన ఉందా లేదా ఉంటే కార్యదర్శులను ప్రశ్నించారు. ఏ ఒక్కరు సరైన సమాధానం చెప్పక పోవడంతో మీరు కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి జీతాలు తీసుకోవడానికేనా ప్రతి విషయంలోనూ కోటవురట్ల మండలం వెనుకబడి ఉందని అధికారులు ఎవరు చిత్తశుద్ధితో పని చేయలేదన్నారు. అనంతరం ఆమె పలు శాఖల పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీ ఇల్లు పనులు ముందుకు సాగక పోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిఎల్‌డివో అరుణ శ్రీ, ఎంపీడీవో చంద్రశేఖర్, పి ఆర్ జె ఈ వర్మ, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, పలు శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

499 రోజుకు మహా ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 499వ రోజుకు చేరింది. శనివారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పైప్ లైన్‌కు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, గుర్రన్న, బాబుజీ, నూకరాజు, తాతాజీ, అప్పలరాజు, జోగిరాజు, రాజు, వీరన్న, దార్రాజు, కోటి, శివ, జాను, కాశీరావు, నల్ల వీర్రా, కాశీరావు, శ్రీను, తాతాజీ, అప్పలరాజు పాల్గొన్నారు .

పెట్రోల్ బంక్ ఏర్పాటు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో గొంప జంక్షన్ వద్ద నూతనంగా పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పొలిటికల్ బ్యూరో అయ్యన్నపాత్రుడు, మాజీ శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని బంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, మండల పార్టీ అధ్యక్షులు రాజానకొండ నాయుడు, ఎంపిటిసి గంజి సూర్యనారాయణ, తట్టబంద గ్రామ సర్పంచ్ గోకివాడ రమణ, సూర్యనారాయణ, గల్లా నాని తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచార భేరి



మధురవాడలో చేపడుతున్న ప్రచారం

- మోడీని సాగనంపితేనే దేశ సంపదకు రక్షణ- సిపిఎం, సిపిఐ నేతలు



అల్లిపురంలో ప్రచారం చేపడుతున్న నాయకులు

బిజెపిని గద్దె దింపుదాం... దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో చేపట్టిన ప్రచార భేరి ఉత్సాహంగా సాగుతోంది. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని సిపిఎం, సిపిఐ నాయకుల ముమ్మరంగా ప్రచారం చేపట్టారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : ప్రచార భేరిలో భాగంగా అల్లిపురం సింహాల ద్వారం వద్ద నుంచి సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర ప్రారంభించారు. పార్టీ సీనియర్ నేత వై.రాజు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఆటో కార్మిక సంఘం నాయకులు జి.అప్పలరాజు, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు నుంచి ఆపరేషన్ కాలనీ, పాండురంగపురం, విష్ణుపురి కాలనీ, దుర్గాబజార్ వరకు సిపిఎం, సిపిఐ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేశారు. మోదీ హఠావో, దేశ్ బచావో అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, సిపిఐ తూర్పు నియోజకవర్గం కార్యదర్శి ఎస్‌కె.రెహ్మాన్ మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత మనువాద భావజాలంతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, వి.కృష్ణమూర్తి, ఎస్.రంగమ్మ, సిపిఐ నాయకులు ఎ.దేవుడమ్మ, కె.లక్ష్మణరావు, కె.రమణ, కాసుబాబు, పి.శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5 వార్డు పరిధి నగరంపాలెంలో సిపిఎం, సిపిఐ నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ, గ్రామాలలో సమస్యల పరిష్కారం కోసం వామపక్ష పార్టీలు పాదయాత్రలు నిర్వహిస్తున్నాయన్నారు. మధురవాడ జాతీయ రహదారి నుంరచి నగరంపాలెం రహదారి ప్రారంభించి ఏళ్ళు గడుస్తున్నా పూర్తి చెయ్యకపోవడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకి నిదర్శనం అన్నారు. స్వతంత్ర నగర్, అయోధ్య నగర్, ద్రోణంరాజు కల్యాణ మండపం, పాత మధురవాడ తదితర ప్రాంతాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులు పాడైపోతున్నాయని ,వీటి స్థానంలో నూతనంగా ట్యాంకులు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, సిపిఐ సిపిఎం నాయకులు ఎమ్‌డి.బేగం, భారతి, ఎ.గురుమూర్తిరెడ్డి, జి.వేళంగినిరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో..

గాజువాక : మోదీ విధానాలు అప్రజాస్వామికమని సిపిఎం, సిపిఐ నాయకులు ఎం.రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ విమర్శించారు. ప్రచార భేరి పాదయాత్రలో భాగంగా శనివారం చైతన్యనగర్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ప్రచార భేరి పాదయాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వామ పక్ష పార్టీల నాయకులు అప్పారి విష్ణుమూర్తి, ఎ.లోకేష్, జి.ఆనంద్, దాసరి అప్పారావు, బెహరా త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలోని 59వ వార్డు పరిధి నెహ్రూనగర్, హనుమాన్‌నగర్, 61వ వార్డు పరిధి మల్కాపురం, 62వ వార్డు పరిధి దుర్గానగర్ ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ నాయకులు ప్రచార భేరి పాదయాత్రలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, సిపిఐ జోన్ నాయకులు జి.రాంబాబు మాట్లాడుతూ, దేశానికే అన్నంపెట్టె రైతన్నలను, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి కేంద్ర ప్రభుత్వం నెట్టిందన్నారు. గ్రామీణ పేదల కోసం ఏర్పాటుచేసిన ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధులు తగ్గించిందని తెలిపారు. మరో వైపు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గుడుపుకుంటుందని విమర్శించారు. ఈ పాదయాత్రలో సిపిఎం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, పిసిని రామారావు, ఆర్.విమల, ఎన్.ఉమ, పి.వరలక్ష్మి, బంగార్రాజు, ఎల్.కృష్ణ, బి.అర్జునరావు, జె.రామునాయుడు, బి.శ్రీను, డి.రాజేష్, సిపిఐ నాయకులు కె.సత్యాంజనేయులు, బి.అప్పారావు, బి.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడులో...

తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి గొల్లవీధి,



మల్కాపురంలో..

ఆదర్శనగర్ ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ నాయకులు శనివారం ప్రచార భేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, అన్నాబత్తుల నరసింగరావు, ఎం.అప్పలరాజు, ఎన్.ఆదినారాయణ, ఎ.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ సంపదను తన కార్పొరేట్ మిత్రులు అదానీ, అంబానీలకు దోచిపెడుతుందని, మోడీ ప్రభుత్వాన్ని సాగనంపడం ద్వారానే దేశ సంపదను రక్షించుకోగలమని సిపిఎం జిల్లా నాయకులు గండి నాయనిబాబు అన్నారు. బిజెపిని గద్దె దింపుదాం... దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమం మండలంలోని సూరెడ్డిపాలెం, ఎ.కోడూరు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడూ మోడీ, అమిత్‌షా జోడీ అన్నదమ్ములుగా కలిసి ఉన్న ప్రజల మధ్య మతచిచ్చు పెట్టి విధ్వేషాలు రెచ్చగొడుతూ చీలకలు తెస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు, వనుం సూర్యనారాయణ, దిక్కుల జోగులు, నారాయణమ్మ, దేవుడమ్మ, సూరి, నాయుడు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రాంబిల్లి : సిపిఎం, సిపిఐ ప్రచార భేరి పోస్టర్లను మండల



గొలుగొండలో..

కేంద్రంలో సిపిఎం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.దేముడునాయుడు, లక్ష్మి, వై.రాము. నూకరాజు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో ప్రచార భేరి వాల్ పోస్టర్‌ను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండలం కన్వీనర్ పి.మాణిక్యం మాట్లాడుతూ ఇంటింటి ప్రచారం ద్వారా మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పర్చునున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గేదెల అప్పారావు, పల్లె అప్పారావు, కొల్లి అప్పారావు, బి శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండ: మతోన్మాద దాడులను రెచ్చగొడుతున్న బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మతోన్మాద దాడులను ప్రేరేపించడం, కులాల మధ్య చిచ్చుపెట్టడం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మేకా సత్యనారాయణ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎల్‌వి.రమణ, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కర్‌రావు, ఏఐవైఎఫ్ జి.రాధాకృష్ణ, ఎస్.వాసుదేవరావు, పి.సత్తిబాబు, ఎస్.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో సిపిఎం సమావేశం జరిగింది. ప్రచార భేరిని జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కమిటీ సబ్యులు డి.సత్తిబాబు మాట్లాడుతూ, బిజేపి అవలంభిస్తోన్న కార్పోరేటు, మతోన్మాద విధానాలపై ప్రజలలో ప్రచారం చేయాలన్నారు. సిపిఎం మండల నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి , జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, మండల కమీటీ సభ్యులు జి.శివ, రాంబాబు, కన్నబాబు, నాగభూషణం, అప్పారావు, పాండు రాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక శ్రీ కన్య కూడలి వద్ద 'ప్రచార భేరి' గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, డి.సత్తిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, జి.గురుబాబు, శివలంక కొండరావు, ఎ. రాజు, ఎల్,గౌరీ, ఎ.ల్.వి. రమణ, మేకా సత్యనారాయణ, భవాని, ఎమ్.భాస్కరరావు, జి రాధాకష్ణ, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, కెవిఎస్ ప్రభ, ప్రసన్న, గీతా కష్ణ , పి బాలరాజు పాల్గొన్నారు



నర్సీపట్నంలో...